సాక్షి అనంతపురం

సోమవారం । 21 । జూలై । 2025



బండి కాదు మొండి!

కాచిగూడ ప్యాసింజర్‌లో ప్రయాణమంటే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కొందరు ప్రయాణికులు మధ్యలోనే దిగిపోతున్నారు.

8లో



టమాట కిలో రూ.31

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.31 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.20 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

35.3°/22.8°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

శిక్షణకు వెళ్లిన కలెక్టర్

- ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా జేసీకి బాధ్యతలు



అనంతపురం అర్బన్: మిడ్ కెరీర్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో పాల్గొనేందుకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ముస్సోరికి వెళ్లారు. అక్కడి లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో ఈనెల 21 నుంచి ఆగస్టు 16వ తేదీ వరకు 26 రోజుల పాటు ఐఏఎస్ అధికారులకు 23వ రౌండ్ ఫేజ్–3 శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణలో పాల్గొనేందుకు వెళ్లిన కలెక్టర్ తిరిగి ఆగస్టు 18న విధులకు హాజరవుతారని కార్యాలయ అధికార వర్గాలు తెలిపాయి. అప్పటి వరకు జేసీ శివ్ నారాయణ శర్మకు ఇన్‌చార్జ్ కలెక్టర్ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది.

నేడు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'



అనంతపురం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. అర్జీల స్థితిని కాల్‌సెంటర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అర్జీలను పరిష్కార వేదికలోనే కాకుండా meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చన్నారు.

13 మండలాల్లో వర్షం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో 13 మండలాల్లో వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లాలో 3.9 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అనంతపురం అర్బన్‌లో 22.8 మి.మీ, విడపనకల్లు 22, కుందుర్పి 19.6, బ్రహ్మసముద్రం 12.2, అనంతపురం రూరల్ 10.2 మి.మీ వర్షపాతం నమోదైంది. పెద్దపప్పూరు, గార్లదిన్నె, కూడేరు, రాప్తాడు,బుక్కరాయసముద్రం, గుంతకల్లు, బెళుగుప్ప, యాడికి మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. రాగల రెండు రోజులు కూడా జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

పీఏబీఆర్‌లో తగ్గిన నీటి మట్టం



కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్)లో నీటి మట్టం తగ్గింది. జలాశయంలోకి ఇన్‌ఫ్లో పూర్తిగా పడిపోయింది. ఈ క్రమంలో ఆదివారం నాటికి డ్యాంలో 1.9 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం వద్ద ఏర్పాటైన శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి, అనంతపురం, ఉరవకొండ తాగునీటి ప్రాజెక్టులకు రోజూ సుమారు 55 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. లీకేజీ, నీటి ఆవిరి, ఇతరత్రా కలిపి మొత్తం 65 క్యూసెక్కుల చొప్పున నీరు వెళ్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. డ్యాంలోకి ఇన్‌ఫ్లో లేకపోతే తాగునీటి ప్రాజెక్టులకు నీటి కొరత ఏర్పడే అవకాశముంది.

సిఫార్సులపై పోరాటం

- బదిలీలపై కోర్టు మెట్లెక్కిన సచివాలయ ఉద్యోగులు
- కలెక్టర్‌కు పలుమార్లు విన్నవించినా ప్రయోజనం శూన్యం
- హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన అగ్రికల్చర్ అసిస్టెంట్లు
- స్టేటస్‌కో ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం



కలెక్టరేట్



ఈ నెల 2న తమకు జరిగిన అన్యాయంపై కలెక్టర్‌కు విన్నవించేందుకు వచ్చిన సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు (ఫైల్)

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వంలో న్యాయం అనేది అందని ద్రాక్షగా మారింది. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు జిల్లా యంత్రాంగంపై స్వారీ చేస్తున్నారు. అధికారులు కూడా వారికి దాసోహమై విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రజాప్రతినిధుల సిఫారసులకు తలొగ్గుతూ నిబంధనలు తుంగలో తొక్కి నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆ తప్పిదాలు చివరికి అధికారుల మెడకే చుట్టుకునే పరిస్థితి నెలకొంది. ఇటీవల నిర్వహించిన సచివాలయ ఉద్యోగుల బది'లీలల'కు సంబంధించి సరిగ్గా ఇదే జరిగింది. బదిలీల ప్రక్రియలో తమకు అన్యాయం జరిగిందంటూ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు హైకోర్టును ఆశ్రయించారు. ఇందులో రాష్ట్రస్థాయి నుంచి జిల్లాస్థాయి అధికారులను బాధ్యులను చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు.

ఖాతరు చేయని వైనం..

వ్యవసాయ శాఖ పరిధిలోని సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియను గత నెల 28న అధికారులు నిర్వహించారు. ఈనెల ఒకటో తేదీన బదిలీల ఉత్తర్వులు జారీ చేశారు. ప్రక్రియలో అధికారులు నియమ,నిబంధనలు పాటించలేదు. దీంతో తొలి ర్యాంకులో ఉన్న తమకు అన్యాయం జరిగిందని పలువురు ఆరోపించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ సుస్మితది ఉమ్మడి జిల్లాలో 5వ ర్యాంక్, శ్రీ సత్యసాయి జిల్లాలో 2వ ర్యాంక్. జనార్దన్‌ది ఉమ్మడి జిల్లాలో 6వ ర్యాంక్, శ్రీ సత్యసాయి జిల్లాలో 3వ ర్యాంక్ అయినా బదిలీల్లో అన్యాయం చేశారు. శిరీష అనే మహిళకు పీహెచ్ కోటా అమలు చేయలేదు. అర్హులైన పలువురు బదిలీల్లో తాము పెట్టుకున్న ఆప్షన్ స్థానాలు ఖాళీగా ఉన్నా ఇవ్వకుండా తరువాతి ర్యాంక్ వాళ్లకు ఇచ్చారు.అగ్రికల్చర్ అసిస్టెంట్ల విషయంలోనే కాదు... సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో ప్రజాప్రతినిధుల సిఫారసులకు పెద్దపీట వేశారనే ఆరోపణలు బహిరంగంగా వచ్చినా ఖాతరు చేయలేదు.

అధికారులను బాధ్యుల్ని చేస్తూ...

బదిలీల ప్రక్రియలో తమకు జరిగిన అన్యాయానికి అధికారులను బాధ్యులను చేస్తూ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు కె.హరినాథ్‌రెడ్డి, హెచ్.జహీర్, జె.రేణుకా, ఎం.సుస్మిత, కె.జనార్దన్, వి.తరుణ్‌రెడ్డి, బి.శిరీష, కడపల రజిత, బీఏ సంధ్య, పి.నేత్ర, జి.సర్‌తాజ్‌లు హైకోర్టులో రిట్ పిటిషన్ (17050 ఆఫ్ 2025) వేశారు. గ్రామ సచివాలయ, వార్డు సచివాలయ శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో పాటు 19 మంది అగ్రికల్చర్ అసిస్టెంట్లను బాధ్యులను చేశారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు వేసిన రిట్ పిటిషన్‌పై హైకోర్టు ఈ నెల 16న స్టేటస్‌కో ఇచ్చింది. ఆ రోజు నుంచి రెండు వారాల పాటు స్టేటస్‌కో కొనసాగించాలని అధికారులను ఆదేశించడం గమనార్హం.

కలెక్టర్‌ను కలిసినా అంతే...

బదిలీల ప్రక్రియలో తమకు అన్యాయం జరిగిందని కలెక్టర్ వినోద్‌కుమార్‌ను బాధిత అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఈనెల 2న కలిసి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. విచారణ చేస్తామని కలెక్టర్ చెప్పి పంపించారు. అటు తరువాత కూడా కలెక్టర్‌ను అగ్రికల్చర్ అసిస్టెంట్లు మూడు, నాలుగు దఫాలు కలిసి తమ గోడు చెప్పుకుని న్యాయం చేయాలని కోరారు. అయితే వారి గోడును ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. దీంతో న్యాయం కోసం 11 మంది అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

సత్యసాయి బోధనల ఆచరణతో స్వీయ పరివర్తన



సంగీత కచేరీ నిర్వహిస్తున్న సత్యసాయి యూత్

ప్రశాంతి నిలయం: సత్యసాయి బోధనలు ఆచరించడం ద్వారా ప్రతి ఒక్కరూ స్వీయ పరివర్తనతో పరిపూర్ణులు అవుతారని వక్తలు పేర్కొన్నారు. 'స్వీయ పరివర్తన కోసం యువత నాయకత్వం' పేరిట రెండు రోజులుగా ప్రశాంతి నిలయంలో జరుగుతున్న సదస్సు ఆదివారం ముగిసింది. సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత గ్రాడ్యుయేషన్ కార్యక్రమం నిర్వహించారు. వేదపఠనంతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 18 దేశాలకు చెందిన యువతీ యవకులు పాల్గొన్నారు. యువతలో స్వీయ పరివర్తన కోసం సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో చేపట్టిన కోర్సును పూర్తి చేసుకున్న యువ నాయకులు మలేషియాకు చెందిన విమల్ రాజ్, యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన రిషా తదితరులు ప్రసంగించారు. సత్యసాయి బోధించిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలను ఆచరించడం ద్వారా మహనీయులుగా మారుతారన్నారు. అనంతరం యువత సంగీత కచేరీ నిర్వహించారు. తర్వాత సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తిలు కోర్సు పూర్తి చేసుకున్న యువతకు సరిఫికెట్‌లు ప్రదానం చేశారు.

మృత్యువులోనూ వీడని బంధం

- రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం
- మరువకొమ్మ క్రాస్ వద్ద ఘటన
- గుమ్మేపల్లిలో విషాదం



రఘునాథరెడ్డి, సావిత్రమ్మ(ఫైల్)



ప్రమాదానికి కారణమైన కారు



ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనం

శింగనమల: సొంతూరిలో బంధువులు అనారోగ్యంతో ఉంటే పరామర్శించడానికి భార్యాభర్త తాడిపత్రి నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. అయితే.. మార్గమధ్యంలో ప్రమాదానికి గురయ్యారు. భర్త సంఘటన స్థలంలోనే మృతి చెందగా.. భార్యను 108 వాహనంలో ఆస్పత్రికి తీసుకెళుతుండగా కన్నుమూసింది. ఈ విషాదకర ఘటన ఆదివారం శింగనమల మరువకొమ్మ క్రాస్ వద్ద చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయకుమార్ తెలిపిన మేరకు... శింగనమల మండలం గుమ్మేపల్లికి చెందిన రఘునాథరెడ్డి (61), సావిత్రమ్మ (59) దంపతులు దాదాపు 19 ఏళ్ల క్రితం తాడిపత్రికి వలస వెళ్లారు. అక్కడే వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. ఒకరికి వివాహం కాగా, మరొకరికి ఇంకా కాలేదు. వీరికి సొంతూరు గుమ్మేపల్లిలో భూములు, ఇల్లు ఉన్నాయి. సొంతూరిలో బంధువులు అనారోగ్యంతో ఉండడంతో పరామర్శించడానికి భార్యాభర్త ఆదివారం కొత్తగా కొన్న ద్విచక్రవాహనంపై తాడిపత్రి నుంచి బయలుదేరారు. మార్గమధ్యంలో శివపురం పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు. కొద్ది దూరంలోని శింగనమల మరువకొమ్మ క్రాస్ వద్దకు చేరుకుని..కొత్తగా నిర్మించిన 554–డీ రోడ్డులో శింగనమల వైపు క్రాస్ అవుతుండగా వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రఘునాథరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని కాలు పూర్తిగా తెగిపోయింది. తీవ్ర గాయాలపాలైన సావిత్రమ్మను 108 వాహనంలో చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలిస్తుండగా.. మార్గ మధ్యంలో మృతి చెందింది. దంపతుల మృతితో ఇటు గుమ్మేపల్లి, అటు తాడిపత్రిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆదివారం సాయంత్రం గుమ్మేపల్లిలో దంపతుల అంత్యక్రియలు నిర్వహించారు. భార్యాభర్త ఎంతో మంచి వారని, గ్రామానికి వచ్చినప్పుడు అందరినీ ఆప్యాయంగా పలకరించే వారని స్థానికులు గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

అండర్ బ్రిడ్జి లేకపోవడంతోనే ...

అనంతపురం–తాడిపత్రి మార్గంలో జాతీయ రహదారి 554–డీ నిర్మాణంలో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన శింగనమలకు అండర్ వే బ్రిడ్జి నిర్మించలేదు. దీంతో తాడిపత్రి నుంచి వచ్చే వారు శింగనమలలోకి రావాలంటే రోడ్డు క్రాస్ చేయాలి. శింగనమల నుంచి అనంతపురానికి వెళ్లాలన్నా ఇదే పరిస్థితి. దీంతో మరువకొమ్మ క్రాస్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నా.. అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.

3న ఉరవకొండలో యోగా పోటీలు



కరపత్రాలను విడుదల చేస్తున్న యోగా సంస్థల ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: జిల్లా యోగాసన అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 3న ఉరవకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు వివేకానంద యోగ కేంద్రం అధ్యక్షుడు ఎం.రాజశేఖరరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫ్లెక్సీలు, కరపత్రాలను నగరంలోని షిరిడినగర్ యోగా కేంద్రంలో ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. జిల్లా స్థాయి విజేతలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఖేలో ఇండియా, అస్మితా గేమ్స్, ఉమెన్‌లీగ్ తదితర పోటీలలో పాల్గొనే అవకాశం ఇస్తారన్నారు. ప్రతిభ చూపి జాతీయ స్థాయి వరకు వెళ్లే వారికి ఏషియన్ ఒలంపిక్ గేమ్స్‌లో పాల్గొనే అవకాశం దక్కుతుందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 99630 28694, 99634 98250 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కన్నీళ్లు పెట్టిస్తున్న తెల్లబంగారం



తొలగించిన పత్తి మొక్కలను చూపుతున్న ఈ రైతు పేరు పుల్లారెడ్డి. పెద్దవడుగూరు మండలం లక్ష్మంపల్లి. ఇటీవల 2 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాడు. నెల గడిచినా వర్షం జాడ కరువవడంతో మొక్కలు ఎదుగుదల లేక ఎండిపోతున్నాయి. దీంతో చేసేది లేక ఆదివారం పొలంలోని పంటనంతా ట్రాక్టర్‌తో దున్నేశాడు. తన కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరైందని, తనలాగే వందల మంది రైతులు ఎటూపాలుపోక పత్తి పంట తొలగిస్తున్నారని పుల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు.

- వర్షాభావంతో అల్లాడిపోతున్న రైతులు
- చేసేది లేక పంట తొలగింపు

పెద్దవడుగూరు: 'తెల్లబంగారం' కన్నీళ్లు పెట్టిస్తోంది. పెద్దవడుగూరు మండలంలోని పలు గ్రామాల్లో జూన్ మొదటి వారంలో కురిసిన తొలకరి జల్లులు రైతుల్లో ఆశలు రేపాయి. పంటల సాగుకు అన్నదాతలు ఉత్సాహంగా ముందుకు సాగారు.మండలంలోని ఆవులాంపల్లి, విరుపాపురం, పెద్దవడుగూరు, లక్ష్మంపల్లి, చిన్నవడుగూరు, దిమ్మగుడి, చిత్రచేడు తదితర గ్రామాల్లో 3,004 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అయితే, మొదట్లో ఆశలు రేపిన వరుణుడు.. పంటలు సాగు చేశాక ముఖం చాటేశాడు. అన్నదాతలు కళ్లకు కాయేలా ఆకాశం వైపు చూస్తున్నా కరుణ చూపడం లేదు. ఈ క్రమంలో పత్తి మొక్కలు ఎదుగుదల లేక ఎండుముఖం పట్టాయి. చేసేదేమీ లేక రైతులు తమ పొలాల్లోని పత్తి పంటను తొలగిస్తున్నారు. ఇటీవల ఆవులాంపల్లిలో ఈశ్వరరెడ్డి తన పొలంలో పత్తి పంటను ట్రాక్టర్‌తో దున్నేశాడు. ఆదివారం లక్ష్మంపల్లికి చెందిన పుల్లారెడ్డి కూడా పంటను తొలగించాడు.ఎకరా పొలంలో పత్తి పంట సాగు చేయాలంటే రూ. 30 వేల దాకా ఖర్చవుతుంది. కూటమి ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' సాయం అందించకపోవడంతో బయట అప్పులు చేసి మరీ పంటలు పెట్టారు. ఇంత చేసినా దురదృష్టం వెంటాడడం గమనార్హం. అప్పులపాలయ్యామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వాలు ఆదుకోవాలి



4 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. సుమారు రూ. లక్షకు పైగా ఖర్చయింది. వర్షాలు లేకపోవడంతో పంట ఎదుగుదల లేదు. రైతులు ఎప్పుడూ కష్టాల్లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాలు ఆదుకోవాలి.

– నరసింహులు, రైతు లక్ష్మంపల్లి, పెద్దవడుగూరు మండలం

ఉన్నతాధికారులకు వివరిస్తాం



గ్రామాల్లో రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందికి పంటల సాగు వివరాలు తెలియజేయాలి. పత్తి రైతుల కష్టాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వానికి నివేదిక పంపి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం

–మునికృష్ణ, ఏఓ, పెద్దవడుగూరు

నిర్లక్ష్య కాటు.. శెనిక్కాయకు పోటు

విత్తన వేరుశనగ పంపిణీలో కూటమి అలసత్వం

- రాయితీ విత్తనం 46,675 క్వింటాళ్లకు పరిమితం చేసిన వైనం
- సాగుపై తీవ్ర ప్రభావం
- వరుణుడి కరుణా లేక తగ్గిన పంట విస్తీర్ణం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ ఈ సారి కేవలం 46,675 క్వింటాళ్లకు పరిమితమైంది. దీనికితోడు పంపిణీ ప్రక్రియను కూటమి సర్కారు ఆలస్యం చేయడం, విత్తన సేకరణ, సరఫరా జాప్యం కావడంతో రాయితీ విత్తనంపై రైతులు నమ్మకం వదిలేసుకున్నారు. ఈ క్రమంలో సాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయింది. జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 3,39,716 హెక్టార్లు కాగా ప్రస్తుతం ప్రధాన పంటల సాగు విస్తీర్ణం 65 వేల హెక్టార్లు నమోదైంది. 23 వేల హెక్టార్లలో వేరుశనగ, 21 వేల హెక్టార్లలో కంది, 9 వేల హెక్టార్లలో పత్తి, 6,800 హెక్టార్లలో మొక్కజొన్న, 3,300 హెక్టార్లలో ఆముదం, వెయ్యి హెక్టార్లలో సజ్జ పంట సాగులోకి వచ్చినట్లు వ్యవసాయశాఖ నివేదికలు చెబుతున్నాయి. ప్రధాన పంటలు విత్తుకునే సమయం చివరి దశకు చేరుకున్నా.. 20 శాతం మాత్రమే సాగులోకి రావడం గమనార్హం. రెండు మూడు రోజులుగా అక్కడక్కడా కురుస్తున్న వర్షాలకు 1.50 లక్షల హెక్టార్ల వరకు ప్రధాన పంటలు సాగులోకి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ప్రత్యామ్నాయంపై దృష్టి..

మృగశిర, ఆరుద్ర, పునర్వసు తదితర విత్తన కార్తెలు ముగుస్తున్నా సరైన పదును వర్షం లేక సాగు చతికిలపడింది. ఆదివారం చివరి విత్తన కార్తె పుష్యమి మొదలు కానుంది. అంటే నెలాఖరు వరకు ప్రధాన పంటల సాగుకు సమయముంది. ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ వేరుశనగ, కంది, పత్తి, ఆముదం లాంటివి విత్తుకోవడం మంచిది కాదని చెబుతున్నారు. దీంతో వ్యవసాయశాఖ అధికారులు 'ప్రత్యామ్నాయం'పై దృష్టి సారించారు. ఆగస్టు, సెప్టెంబర్‌లో ప్రత్యామ్నాయం కింద ఉలవ, పెసర, అలసంద, కొర్ర లాంటి విత్తనాలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడానికి క్షేత్రస్థాయి నివేదికలు తీసుకుంటున్నారు. 1.50 లక్షల హెక్టార్లకు ప్రత్యామ్నాయ విత్తన ప్రణాళిక సిద్ధం చేయడానికి వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేస్తోంది.



రైతుల అనాసక్తి..

గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది జిల్లాకు కేవలం 50 వేల క్వింటాళ్లు మాత్రమే కేటాయించారు. ఎట్టకేలకు అందులో 46,675 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు అధికారులు ప్రకటించారు. రాయదుర్గం, గుత్తి, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట మండలాల్లో మాత్రమే విత్తన పంపిణీ కొంచెం మెరుగ్గా ఉంది. తాడిపత్రి డివిజన్ పరిధిలో అయితే నార్పలలో 1,400 క్వింటాళ్లు పంపిణీ చేయగా... పెద్దపప్పూరు, తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో ఒక్క క్వింటాలు కూడా పంపిణీ చేయలేదు. మిగతా మండలాల్లో మోస్తరుగా జరిగింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా రాయితీ విత్తన వేరుశనగ తీసుకునేందుకు రైతులు అనాసక్తి ప్రదర్శించారు.

40 శాతం లోటు..

జూన్, జూలైకు సంబంధించి 35 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు 104.2 మి.మీ గానూ 66.9 మి.మీ నమోదైంది. జూన్‌లో ఓ మోస్తరుగా అక్కడక్కడా కురిసిన తేలికపాటి వర్షాల వల్ల ఈ మాత్రం నమోదు కావడం విశేషం. మూడు మినహా తక్కిన 29 మండలాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షాలు కురిశాయి.

క్లుప్తంగా

ఇరు పార్టీల నాయకులపై కేసుల నమోదు

తాడిపత్రి టౌన్: ఈ నెల 18న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో తాడిపత్రిలో నిర్వహించిన రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించారంటూ పలువురు వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులపై పోలీసులు ఆదివారం కేసులు నమోదు చేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన బ్రహ్మానందారెడ్డి, ఓబులరెడ్డితో పాటు మరికొందరు.. టీడీపీకి చెందిన రవీంద్రారెడ్డితో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు. అయితే వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసుల అనుమతితో కార్యక్రమం నిర్వహించుకుంటుంటే టీడీపీ నాయకులు అడ్డుకునేందుకు కర్రలతో అలజడులు సృష్టించారని, ఇలాంటి సమయంలో టీడీపీ వారిపై కేసులు నమోదు చేయాల్సిన పోలీసులు వైఎస్సార్‌సీపీ నాయకులపై కూడా బనాయించడం పోలీసుల ద్వంద్వ వైఖరికి నిదర్శనమనే వాదనలు వినిపించాయి.

యువకుడి ఆత్మహత్య


రమేష్‌నాయుడు (ఫైల్)

గార్లదిన్నె: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లికి చెందిన రమేష్ నాయుడు(30), అనంతపురం నగర శివారులోని శిల్పాలేపాక్షి నగర్‌లో నివాసముంటున్న మానస ప్రేమించుకుని, గత నెల 7న పెద్దపప్పూరు మండలం అశ్వత్థ క్షేత్రంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. 20రోజులు సజావుగా జరిగిన సంసార జీవితంలో అనంతరం కలహాలు మొదలయ్యాయి. దీంతో ఈ నెల 6న భర్తతో గొడవ పడి మానస పుట్టింటికి వెళ్లి పోయింది. అప్పటి నుంచి దిగాలుగా ఉన్న రమేష్‌నాయుడు.. ఆదివారం ద్విచక్ర వాహనంపై గార్లదిన్నె మండలం తిమ్మంపేట గ్రామం వద్దకు చేరుకుని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళుతున్న వారు గుర్తించి, సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని అనంతపురంలోని సర్వజనాస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ అరెస్టులకు భయపడం


అనంతపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగం నాయకులు


గుంతకల్లులో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

- ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్‌పై పెల్లుబుకిన నిరసనలు
- రెడ్‌బుక్ రాజ్యాంగం నశించాలంటూ నినాదాలు

అనంతపురం టవర్‌క్లాక్: రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అక్రమ అరెస్టులకు భయపడబోమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తూ అనంతపురం జెడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రెడ్‌బుక్ రాజ్యాంగం నశించాలంటూ నినాదాలు చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యుడు రమేష్‌గౌడ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్ర, విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి తదితరులు మాట్లాడుతూ.. మిథున్‌రెడ్డి అరెస్టును ప్రజా గొంతుక నొక్కే దుశ్చర్యగా అభివర్ణించారు. 13 నెలల కూటమి పాలన వైఫల్యాలపై ప్రజలను చైతన్య పరుస్తున్నామనే అక్కసుతోనే అక్రమ అరెస్టులకు ప్రభుత్వం తెరతీసిందన్నారు. ఎలాంటి ఆధారాలు లేని లిక్కర్ కేసులో మిథున్‌రెడ్డిని దోషిగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుతో రాష్ట్రంలో అశాంతికి కారణమవుతున్నారని, ఈ అంశంపై రాష్ట్రపతి స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడయితే అణిచివేత ఉంటుందో అక్కడే తిరుగుబాటు మొదలవుతుందని చరిత్ర చెబుతున్న సత్యమన్నారు. అక్రమ అరెస్టులు ఆపకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరా, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ రిజ్వాన్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి, అధికార ప్రతిధి మారుతీనాయుడు, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, మాజీ నగర అధ్యక్షుడు సాకే శివశంకర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్, సుధీర్‌రెడ్డి, కైలాష్, మంజునాథరెడ్డి, గురుదత్త, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, గౌస్‌బేగ్, సైపుల్లాబేగ్, అమరనాథ్‌రెడ్డి, అనిల్‌గౌడ్, దాదు, జయరామ్ నాయక్, శేఖర్ నాయుడు, దిలీప్‌రెడ్డి, రవితేజ, కార్పొరేటర్ చంద్రలేఖ, కుళ్లాయి స్వామి, అశోక్, నితిన్, హరి, వెంకట్, ఫయాజ్, రాహుల్‌రెడ్డి, ఆదిల్, నరేంద్రరెడ్డి, బాబా ఇమ్రాన్, వంశీనాయుడు, వేణు, శేఖర్, పులి కార్తీకేయ, గౌస్, వసీం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటాం

గుంతకల్లుటౌన్: కూటమి ప్రభుత్వ అక్రమ అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి వంశీయాదవ్, యువజన విభాగం గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్ అన్నారు. మద్యం అక్రమ కేసులో ఎలాంటి ఆధారాల్లేకపోయినా ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ ఆదివారం వైఎస్సార్ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో గుంతకల్లులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్, ఇతర హామీలను నెరవేర్చకపోవడంతో ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు. దీంతో ప్రజల దృష్టిని మరల్చేందుకు అక్రమ అరెస్టులకు ప్రభుత్వం తెరతీసిందని మండిపడ్డారు. ఎవరెన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ అనుబంధ సంఘాల నియోజకవర్గ అధ్యక్షులు రంగనాయకులు, పవన్, అంజి, నారప్ప, సూర్యరెడ్డి, నాయకులు సూర్య, ఆనంద్, శివ, రాము రాయల్, సాయి సునీల్, రాజశేఖర్, మనోజ్, శాంతనాయుడు, లింగా, మణికంఠ, దాదా, తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కారు

- ఆరుగురికి గాయాలు

శింగనమల: హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు వెళ్లు తున్న కారును శింగనమల మండలం లోలూరు క్రాస్ వద్ద వెనుక నుంచి ఓ లారీని ఢీకొంది. హైదరాబాద్‌కు చెందిన మొహిజుద్దీన్ ఆలీ, కుటుంబసభ్యులు ఆరుగురు కలసి శనివారం రాత్రి బెంగుళూరుకు కారులో బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజామున శింగనమల మండలం లోలూరు క్రాస్ స్పీడ్ బ్రేకర్ల వద్దకు చేరుకోగానే ముందు వెళుతున్న లారీ వేగం తగ్గడంతో వెనుకనే ఉన్న కారు ఢీకొంది. కారులో నున్న ఫిర్దోస్, మోసిన్, బిలాల్ అహమ్మద్, మరియన్, అజీరతో పాటు మొహిజుద్దీన్ గాయపడ్డారు. అటుగా వెళుతున్న వారు క్షతగాత్రులను వెంటనే 108లో అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

యువకుడి దుర్మరణం - నేత్రాలు దానం


భరత్‌సింహ రెడ్డి (ఫైల్)

గార్లదిన్నె: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలం యర్రగుంట్లకు చెందిన రమేష్‌రెడ్డి, తోలిశమ్మ దంపతుల పెద్ద కుమారుడు భరత్‌సింహ రెడ్డి (22) డిగ్రీ వరకు చదువుకుని, రెండేళ్లుగా బీకేఎస్ మండల పరిధిలోని వడియంపేట వద్ద ఉన్న హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో పనిచేస్తున్నాడు. రోజూ ద్విచక్ర వాహనంపై విధులకు వెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు విధులకు వెళ్లిన అతను.. అనంతరం రాత్రి 11 గంటలకు డ్యూటీ ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. బి.కొత్తపల్లి వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. అదే సమయంలో విధులు ముగించుకుని వస్తున్న తోటి ఉద్యోగులు గమనించి సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మరణానంతరం భరత్‌సింహారెడ్డి నేత్రాలను దానం చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు. దీంతో మృతుడి నేత్రాలను జీజీహెచ్‌లో హైదరాబాద్‌కు చెందిన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సిబ్బంది సేకరించారు. అనంతరం సాయంత్రం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

బండి కాదు.. మొండి!

- 12 కి.మీ. ప్రయాణానికి రెండు గంటలకు పైగా సమయం
- గంటల తరబడి రైల్వేస్టేషన్ సమీపంలో నిలుపుదల
- ఈ రైలులో ప్రయాణామంటే చిర్రెత్తిపోతున్న ప్రయాణికులు


డీఆర్‌ఎం కార్యాలయ సమీపంలోని బ్రిడ్జి వద్ద నిలిపివేసిన ప్యాసింజర్ రైలు, సెల్‌ఫోన్ లైట్ల సాయంతో బ్రిడ్జి దిగుతున్న ప్రయాణికులు

గుంతకల్లు: రైలు ప్రయాణం ఎంతో ఆనందాన్ని, అనుభూతిని కలిగిస్తుంది. రైలు ప్రయాణం అనేది కేవలం గమ్యస్థానానికి చేరుకునే మార్గం మాత్రమే కాదు, ప్రయాణంలోనే ఒక గొప్ప అనుభూతిని మిగులుస్తుంది. రైలు ప్రయాణంలో ప్రకృతి అందాలను దగ్గరగా చూడవచ్చు. పచ్చని పొలాలు, కొండలు, నదులు, అడవులు వంటివి మన కళ్లకు కనువిందు చేస్తాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులతో కలిసి ప్రయాణించే అవకాశం ఉంటుంది. వారి అనుభవాలను పంచుకోవడం, కొత్త స్నేహాలను ఏర్పరచుకోవడం వంటివి రైలు ప్రయాణంలో సాధ్యమవుతాయి. రైలు ప్రయాణం సాధారణంగా సౌకర్యవంతంగా ఉంటుంది. బెర్తులు, భోజన సదుపాయాలు వంటివి ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తాయి.

బాబోయ్ ఆ రైలు ప్రయాణమా?

వైద్యం కోసం నిత్యం ఎందురో రోగులు గుంతకల్లు, పరిసర ప్రాంతాల నుంచి కర్నూలు, హైదరాబాద్‌కు ఉదయాన్నే కాచిగూడ ప్యాసింజర్ రైలులో వెళ్తుంటారు. అలాగే ఉద్యోగ, విద్యా నిమిత్తం కర్నూలు, హైదరాబాదు వెళ్లే వారికి కూడా ఈ రైలు ఎంతో ఉపయోగకరం. తిరుగు ప్రయాణంలో ఈ రైలుకే వస్తుంటారు. ఎందుకంటే ఈ ప్యాసింజర్ బండికి చాలా తక్కువ చార్జీ. బస్సు చార్జీలు భరించలేని చాలా మంది ఈ రైలులోనే ప్రయాణిస్తుంటారు. అయితే ఈ రైలు ప్రయాణమంటే ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు. రైలు ప్రయాణికుల సహనానికి, శాంతికి పెను సవాలుగా మారిన ఈ ప్యాసింజర్ రైలుకు వారు పెట్టుకున్న ముద్దు పేరు 'దయ్యాల బండి'. ఎందుకంటే దయ్యాలు సంచరిస్తాయని భావించే అర్ధరాత్రి వేళ ఈ ప్యాసింజర్ రైలు గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. వాస్తవానికి షెడ్యూల్ ప్రకారమైతే ఈ ప్యాసింజర్ బండి సాయంత్రం 7.30 గంటలకు గుంతకల్లుకు చేరుకోవాలి. కానీ ఈ రైలు చరిత్రలో ఏనాడూ సరైన సమయానికి గమ్యస్థానం చేరింది లేదు.

12 కి.మీల ప్రయాణానికి రెండు గంటలపైగా..

కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి ఉదయం 11.00 గంటలకు బయలుదేరిన ఈ ప్యాసింజర్ (57412) రైలు సాయంత్రం 7.30 గంటలకు గుంతకల్లు చేరుకోవాలి. 46 రైల్వేస్టేషన్లు దాటుకుని 47వ రైల్వేస్టేషన్ కర్నూలు జిల్లాలోని మద్దికెర చేరుకునేంత వరకూ ప్రయాణం ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. మద్దికెర స్టేషన్‌కు చేరుకోగానే తన విశ్వ రూపాన్ని చూపుతుంది. మద్దికెర రైల్వేస్టేషన్ నుంచి గుంతకల్లు రైల్వే జంక్షన్ మధ్య దూరం 12 కిలోమీటర్లు ప్రయాణించేందుకు రెండు, మూడు గంటల సమయం తీసుకుంటుంది. ఇక మద్దికెర రైల్వేస్టేషన్‌లో కనీసం గంటపాటు నిలిపి వేస్తారు. తర్వాత వచ్చే చిన్న స్టేషన్ మల్లపగేట్ వద్ద మరో గంట ఆగిపోతుంది. ఇక గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు మరో రెండు నిమిషాల్లో చేరుకుంటాం అనుకునే తరుణంలో ఔటర్‌లో డీఆర్‌ఎం కార్యాలయం వద్ద మరో గంటసేపు నిలిచిపోతుంది. అయితే ఇన్ని గంటల పాటు ఈ రైలును నిలపడానికి కారణాలు ఏమిటో ఇప్పటికీ ఎవరికీ తెలియదు.

మధ్యలోనే దిగిపోతారు..

రోజూ చిమ్మ చీకట్లో గంటల తరబడి ఊర్ల బయట ఈ రైలు నిలిచిపోయి ప్రయాణికులను బెంబేలెత్తిస్తుంది. ఈ రైలులో ఎలాంటి పోలీసు భద్రత ఉండదు. దీంతో మహిళా ప్రయాణికులు భయంతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తుంటారు. చాలా మంది ప్రయాణికులు ఈ రైలు పరిస్థితి తెలుసుకుని మద్దికెరలోనే దిగి ఆటోల్లో గుంతకల్లుకు చేరుకుంటారు. మరికొందరు గత్యంతరం లేక అలాగే గుంతకల్లు వరకూ ప్రయాణిస్తారు. డీఆర్‌ఎం కార్యాలయం సమీపంలోని బ్రిడ్జి వద్ద బండి నిలబడగానే బోగీలు దిగి కంకరపై లగేజ్ బ్యాగులు మోసుకుంటూ వెళ్లిపోతుంటారు. ఈ బాధలు తెలిసి కూడ రైల్వే అధికారులు ఈ ప్యాసింజర్ బండిని సమయానికి గుంతకల్లు స్టేషన్‌కు చేర్చడంలో విఫలమతున్నారు.

భయపడుతూ ప్రయాణించాలి



నేను కర్నూలులో చదువుకుంటున్నాను. నెలాలో ఒకసారి ఫ్రెండ్స్‌తో కలిసి గుంతకల్లు వస్తుంటాను. ఈ రైలు ప్రతిసారీ చాలా లేట్‌గా వస్తుంది. అంతేకాక ఎక్కడ బడితే అక్కడ నిలిపి వేస్తుంటారు. అలాంటి సమయంలో చాలా భయమేస్తుంది. తాగుబోతులు మా బోగీలోకి వస్తుండడంతో భయపడి ప్రయాణికులు ఎక్కువగా ఉన్న బోగీలోకి వెళ్తుంటాం.
– ఉమామహేశ్వరి, విద్యార్థి, గుంతకల్లు

మధ్యలోనే దిగేస్తా



నేను డోన్‌లో పోస్టల్ ఉద్యోగం పనిచేస్తున్నా. రోజూ గుంతకల్లు నుంచి డోన్‌కు ఈ ప్యాసింజర్ రైలులోనే ప్రయాణం చేస్తుంటాను. ఉదయం రైలు సమయానికి పోతే.. సాయంత్రం వచ్చేసరికే నరకం చూపుతుంది. తీరా స్టేషన్ చేరుకుంటాం అనుకునే సమయానికి డీఆర్‌ఎం ఆఫీస్ వద్ద నిలిపివేస్తారు. దీంతో అక్కడే రైలు దిగి నడుచుకుంటూ ఇంటికి వెళ్లిపోతా.
– శ్రీనివాసులు, పోస్టల్ ఉద్యోగి, గుంతకల్లు

అపరిశుభ్రతకు ఐఎస్ఓ గుర్తింపా?!


దుమ్ము పట్టిన ఫ్యాన్లు, పైకప్పు ఊడి ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ (జేడీఏ) కార్యాలయంలో కీలక విభాగం గది ఇది. అందులోనూ గత ఏడాది ఐఎస్ఓ గుర్తింపు కూడా దక్కించుకుంది. నలుగురు ఉద్యోగులు రోజూ విధులు నిర్వర్తించే ఆ గదిలో కుర్చీలు, బల్లలు, చెక్క బీరువాలు విరిగిపోయాయి. సెల్ఫ్‌లు, చిత్తుకాగితాలు, రికార్డులు బూజుపట్టాయి. గోడలు నెర్రెలు చీలాయి. పైకప్పు ఊడి పడేలా ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఫ్యాన్లు దుమ్మపట్టిపోయాయి. మాసిన చీరలు, కర్టన్లతో పాత రికార్డులన్నీ అస్తవ్యస్తంగా భద్రపరిచారు. అపరిశుభ్రత కారణంగా గదిలో ఓ రకమైన దుర్గంధం. ఇక బాత్‌రూం డోర్ ఓపెన్ చేయాలంటే సాధారణమైన వ్యక్తులతో కాదు. గదిలోకి బయట వారు కాలు పెడితే ముక్కు మూసుకోవాల్సిందే. ఇలాంటి కార్యాలయానికి ఐఎస్ఓ సర్టిఫికెట్ ఎలా దక్కిందో... దాని వెనుక దాగి ఉన్న 'వినోద'మేమిటో కూటమి సర్కార్‌కే ఎరుక అని ఉద్యోగులు విమర్శలు గుప్పిస్తున్నారు.

అప్రజాస్వామికం



ఉరవకొండ: రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు అప్రజాస్వామికమని, రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారని ఉరవకొండ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, పార్టీ పీఏసీ సభ్యుడు వై.విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడం చేత కాక ప్రజల దృష్టిని మళ్లించేందుకు వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు కూటమి ప్రభుత్వం తెరతీసిందన్నారు. ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నిస్తునందుకే మిథున్‌రెడ్డిపై లిక్కర్ స్కాంలో తప్పుడు కేసు బనాయించి అరెస్టు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పారదర్శకంగా మద్యం పాలసీ అమలైందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం లేని లిక్కర్ స్కాం కేసును తెర మీదకు తెచ్చి రూ.50వేల కోట్ల దోపిడీ అని ప్రారంభించి, ఇప్పుడు రూ.2వేల కోట్ల కుంభకోణమంటూ అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదన్నారు.

ఓర్వలేక పోతున్నారు



కళ్యాణదుర్గం రూరల్: సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వ పెద్దలు ప్రజల్ని మోసం చేసిన తీరుని ప్రజాక్షేత్రంలో వైఎస్ఆర్‌సీపీ నేతలు ప్రశ్నిస్తుండటాన్ని ఓర్వలేక... లేని కేసులను సృష్టించి అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఎంపీ మిథున్‌రెడ్డిని ఉద్దేశపూర్వకంగా కేసులో ఇరికించి అరెస్ట్ చేశారని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మిథున్‌రెడ్డి అరెస్ట్‌ను ఖండించారు. రాజకీయ కక్ష సాధింపులకు ఇది పరాకాష్ట అని అన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని, వైఎస్సార్‌సీపీని ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పెట్టుకుందని విమర్శించారు. లేని మద్యం కేసు సృష్టించి ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు.

రాజకీయ కక్ష సాధింపులో భాగమే..



ఉరవకొండ: లిక్కర్ స్కాం పేరుతో లోక్‌సభ ప్రతిపక్షనేత పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా కక్షపూరిత రాజకీయాలు చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారని, అయితే ఆయన కడిగిన ముత్యంలా బయటకు వస్తారని పేర్కొన్నారు. వాస్తవానికి 2014-19 మధ్య అప్పటి సీఎం చంద్రబాబు మద్యం విక్రయాల్లో అనేక అక్రమాలు చేసి, వివిధ కేసుల్లో ఎ-2గా ఉన్నారన్నారు. చంద్రబాబు బెయిల్‌పై బయట ఉంటూ ఈ కేసు నుంచి ఊరట పొందారని గుర్తు చేశారు. కక్ష సాధింపులను ధైర్యంగా ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు సాగిస్తామన్నారు.

ఎల్లకాలం సాగవు



గుంతకల్లు టౌన్: రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పక్కన పెట్టి వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై. వెంకట్రామిరెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మద్యం అక్రమ కేసులో ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. కక్షపూరిత రాజకీయాలు ఎల్లకాలం సాగవని, రెడ్‌బుక్ రాజ్యాంగంతో వైఎస్సార్‌సీపీని కట్టడి చేయాలనుకోవడం వారి అవివేకమన్నారు. న్యాయస్థానాలపై తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు. మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకొస్తారన్నారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేసే వరకూ పోరాడుతూనే ఉంటామని స్పష్టంచేశారు. రాజకీయ కక్ష సాధింపులు మానకపోతే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

కూటమి అరాచకాలకు పరాకాష్ట



తాడిపత్రి టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచకాలు పరాకాష్టకు చేరుకున్నాయని, చంద్రబాబు, లోకేష్, పవన్‌కళ్యాణ్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజమెత్తారు. లిక్కర్ కేసులో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టును ఆయన ఖండించారు. లేని లిక్కర్ కేసును కేవలం రాజకీయ కక్షతోనే సృష్టించి దర్యాప్తు ముసుగులో సాక్షులను వేధించి, అపద్దపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలు సృష్టించి వైఎస్సార్‌సీపీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు ఇలాంటి దుశ్చర్యలకు తెరతీశారన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజా తిరుగుబాటు మొదలైందని, ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు. అక్రమ అరెస్టులతో భయపెట్టలేరని అన్నారు.

రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


విద్యార్థినికి పురస్కారం అందజేస్తున్న న్యాయమూర్తి శివశంకర్, తదితరులు

అనంతపురం ఎడ్యుకేషన్: గత విద్యా సంవత్సరంలో పదోతరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన రజక సామాజిక వర్గానికి విద్యార్థులకు ఆదివారం 'ప్రతిభా పురస్కారాలు' అందజేశారు. అనంతపురంలోని కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రజక ఉద్యోగ విద్యావంతుల సంఘం జిల్లా అధ్యక్షుడు సి.ఎర్రిస్వామి అధ్యక్షత వహించారు. రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి, న్యాయమూర్తి శివశంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం 51 మంది పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు పురస్కారాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్లు రామాంజనేయులు, పరమేష్, రజక సంఘం నాయకులు శ్రీరాములు, కృష్ణమూర్తి, ఆనంద్, బయన్న, నాగరాజు, పద్మావతి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సోమవారం నుంచి అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' (రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో) కార్యక్రమం చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు డివిజన్, పంచాయతీ పరిధిలో ఈనెల 21, 22, 23 తేదీల్లో ఈ కార్యక్రమం ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు మోసాల వల్ల ఒక్కో కుటుంబం ఎంత నష్టపోయిందో క్యూఆర్ కోడ్ సాయంతో వివరించాలని కోరారు.

పాఠశాలకు వాటర్‌ప్లాంట్ వితరణ



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

రామగిరి: పేరూరు డ్యాంలోని ఏపీఆర్ఎస్ బాలుర పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన సీసీఎల్ (కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్) వారు వాటర్ ప్లాంట్ వితరణ చేశారు. ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాటర్ ప్లాంట్‌ను సాహితీ గగన్ మహల్ అధ్యక్షుడు, న్యాయవాది ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1000 లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్‌ప్లాంట్‌ను సుమారు రూ.1.70 లక్షల ఖర్చుతో పాఠశాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో సేవా కార్యక్రమాలు విరివిగా చేపట్టడం జరుగుతోందన్నారు.

28 నుంచి శ్రావణమాస ఉత్సవాలు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 28వ తేదీ నుంచి శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభం అవుతాయని ఆలయ ఈఓ బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 28వ తేదీన నాగులచవితి సర్పసూక్త క్షీరాభిషేకం, 29న నాగపంచమి సర్పసూక్త పవమాన సూక్త క్షీరాభిషేకం, 30వ తేదీన షష్టి మహోత్సవం, సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణోత్సవం, ఆగస్టు 9వ తేదీన శ్రావణ పౌర్ణమి విశేష అభిషేకం, 10వ తేదీన అన్నాభిషేకం నిర్వహించడం జరుగుతుందన్నారు.

అపూర్వ సత్సంగ విభావరి



గీతాలు ఆలపిస్తున్న గాయకులు

అనంతపురం కల్చరల్: నగరంలోని మూడవ రోడ్డు ఘంటసాల భవన్ వేదికగా ఆదివారం సాగిన అపూర్వ సత్సంగ విభావరి శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. మోహన-కల్యాణి స్వర రాగ విభావరిగా ఆ రాగాల్లో స్వరపరచిన పలు భాషల గీతాలను గాయకులు అద్భుతంగా ఆలపించారు. అనంత ఘంటసాల ఆరాధన సమితి నిర్వాహకులు పాల సముద్రం నాగరాజు, విజయలక్ష్మి, ఆచార్య సుధాకరబాబు, డీఆర్వో మలోల పాటలు పాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఔత్సాహిక గాయకులకు విరివిగా అవకాశాలు కల్పిస్తూ వారిని ప్రోత్సహిస్తున్న తీరు అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. అనంతరం ఆచార్య సుధాకరబాబు చిత్రపటాన్ని ఘంటసాల రామయ్య తదితరులు ఆవిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అశోక్ రెడ్డి

అనంతపురం: నగరంలోని టీవీ టవర్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. తాడిమర్రి మండల కేంద్రానికి చెందిన అశోక్ రెడ్డి ద్విచక్ర వాహనంలో నగరం వైపు వస్తున్నాడు. రమణ అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా, అదుపు తప్పి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో అశోక్ రెడ్డి, రమణకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో అశోక్ రెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రమణ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. అశోక్ రెడ్డి ఎస్కేయూలో పీజీ పూర్తి చేశారు. వైఎస్సార్ విద్యార్థి విభాగంలో ఉంటూ పలు విద్యార్థి ఉద్యమాల్లోనూ పాల్గొన్నాడు. అశోక్ రెడ్డి మృతిపై పలువురు విచారం వ్యక్తం చేశారు.

నేడు కామిక ఏకాదశి

అనంతపురం కల్చరల్: రామనగర్‌లోని రుక్మిణీ విఠల పాండురంగస్వామి ఆలయంలో సోమవారం కామిక ఏకాదశి వేడుకలు జరగనున్నాయి. స్వామివారి నిజ రూపదర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకుడు ఆనంద్ తెలిపారు. తెల్లవారుజాము నుంచే స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలతో పాటూ అలంకార సేవలుంటాయని పేర్కొన్నారు.



పంపనూరులో రైతు సేవా కేంద్రానికి తాళం వేయకుండా వదిలేసిన దృశ్యం

ఎనీ టైమ్ ఓపెన్..

ఆత్మకూరు: పని వేళలు, సెలవు రోజులు అనే తేడా లేకుండా పంపనూరు రైతు సేవా కేంద్రం నిత్యం తెరుచుకునే ఉంటుంది. ఆదివారం సెలవు రోజు సైతం కార్యాలయానికి తాళం వేయకపోవడంతో ఆర్ఎస్‌కే సిబ్బంది పనితీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రైతు సేవా కేంద్రంలో రిజిష్టర్లు, మిషన్లు, విలువైన వస్తువులు ఉన్నాయి. అయితే వ్యవసాయ కార్యాలయ సిబ్బంది మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రైతు సేవా కేంద్రానికి సంబంధించిన తాళాలను రోడ్డు పక్కన ఓ దుకాణదారుడికి ఇచ్చేస్తున్నారు. సిబ్బంది విధులకు వచ్చినా రాకున్నా కార్యాలయం ఎప్పుడూ తెరిచే ఉండటంతో చోరీలు జరిగే అవకాశం లేకపోలేదు. ప్రభుత్వ కార్యాలయానికి సంబంధించిన తాళాలు బయట వ్యక్తులకు ఎలా ఇస్తారు ? అంటూ సిబ్బందిపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చందమూరు సమీపంలో గుంతలతో అధ్వానంగా తయారైన రోడ్డు

గుంతల దారి.. పడతారు జారి

చెన్నేకొత్తపల్లి: ఎన్ఎస్‌గేట్ నుంచి ధర్మవరం వెళ్లే ప్రధాన రహదారిపై చందమూరు బస్టాండ్‌కు సమీపంలో నూతనంగా నిర్మించిన కల్వర్టు వద్ద రోడ్డుపై గుంతలు పడ్డాయి. నిత్యం ఈ రహదారిపై వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తిరుగుతున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అలాగే ప్యాదిండి బస్టాండ్‌లో రోడ్డు మధ్యన ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. రాత్రి సమయంలో గుంతలు కనిపించక వేగంగా వాహనాలను నడిపితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వ అక్రమాలు, అవినీతి దృష్టి మరల్చేందుకే ఎంపీ మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారని మేయర్ మహమ్మద్ వసీం విమర్శించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి డైవర్ట్ పాలిటిక్స్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా రూ.లక్షల కోట్లు అప్పులు తెచ్చి అమరావతి పేరిట విచ్చలవిడిగా ఖర్చు చేస్తోందని ఆరోపించారు. ప్రతి నెలా ఏదో ఒక వివాదాన్ని తెరపైకి తెస్తూ ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పారదర్శకంగా ప్రభుత్వ మద్యం దుకాణాలు నిర్వహిస్తే అవినీతికి ఆస్కారం ఎక్కడుందని ప్రశ్నించారు. ఎలాంటి ఆధారాలు లేకున్నా కక్ష సాధింపు కోసం మద్యం కుంభకోణం అంటూ అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. అందులో భాగంగానే ఎంపీ మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎవరూ భయపడరని స్పష్టం చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని త్వరలోనే కూటమి నేతల అరాచకాలకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



మాట్లాడుతున్న మేయర్ వసీం

ప్రభుత్వ తీరును ఎండగడతాం

ఆత్మకూరు: అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమంగా కేసులు బనాయిస్తున్న కూటమి ప్రభుత్వం భవిష్యత్‌లో మూల్యం చెల్లించుకోక తప్పదని ఎంపీపీ హేమలత తెలిపారు. ఆదివారం ఎంపీపీ ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసు పెట్టి అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చంద్రబాబు విఫలమయ్యారన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగే వ్యవహరిస్తే ప్రభుత్వ తీరును ఎండగడతామని హెచ్చరించారు. కూటమి ఎమ్మెల్యేలు చాలా దారుణంగా మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించకపోవడం దారుణమన్నారు.

బదిలీ ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: బదిలీ పొందిన ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీలూరి రమణారెడ్డి, ఎస్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బదిలీ పొందిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు లేవన్నారు. ఫలితంగా జీతాలు ఆలస్యం చేయడం అన్యాయం అని మండిపడ్డారు. రెండు నెలలుగా జీతాలు రాలేదన్నారు. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా ప్రత్యామ్నాయంగా వారికి జీతాలు చెల్లించే మార్గం ఆలోచించాలని డిమాండ్ చేశారు. కొత్తగా అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలల డీడీఓలకు కోడ్‌లు కేటాయించారని.. ఉపాధ్యాయులకు జీతాలు చేయాలంటే పొజిషన్ ఐడీలు లేవంటున్నారని తెలిపారు. పొజిషన్ ఐడీల ఆలస్యం అయ్యే పక్షంలో వారికి అవకాశం ఉంటే సంబంధిత ఎంఈఓలతో ఈ నెలకు జీతాలు చేయించాలన్నారు. అలాగే ఐఆర్ వెంటనే ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఆర్థిక సెలవుల నగదు బకాయిలు, మెడికల్ బిల్లులు చెల్లించాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు పీవీ శివయ్య ఆచారి, ఎస్.సురేష్ కుమార్, మల్లికార్జున, నారాయణ స్వామి, రామకృష్ణ, కె.చంద్ర శేఖర్ స్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరి రమణారెడ్డి

గాయత్రీ మాతా పాహిమాం



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్: బ్రాహ్మణ ఐక్య వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఆషాఢమాస ముగింపు ఉత్సవాలు ఘనంగా సాగాయి. హౌసింగ్ బోర్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని వేదమాత గాయత్రి దేవస్థానంలో ఆషాఢ మాస సారె సమర్పణ కార్యక్రమం వేడుకగా సాగింది. అధిక సంఖ్యలో తరలివచ్చిన మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. గాయత్రీ అమ్మవారికి శాకంబరి అలంకారం, ఒడిబియ్యం, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ అమ్మవారికి వడిబియ్యం సమర్పించి ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో హోసూరు రామసుబ్రహ్మణ్యం, ఏఎల్ఎన్ శాస్త్రి, మారుతి, సత్యనారాయణ, విశ్రాంత తహసీల్దార్ మురళీధర్, బాలసుబ్రహ్మణ్యం, దాక్షాయణి, లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

ఆద్యలక్ష్మికి అవార్డు



ఆద్యలక్ష్మికి ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: బెంగళూరులోని బ్యాండ్ స్టాండ్‌లో ఆదివారం ఇండియా బుక్ ఆఫ్ రికార్డు వారు ప్రపంచ రికార్డులను సమం చేసిన వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. నగరంలోని విశ్వనాథ్, ధరణి మనవరాలైన ఆద్యలక్ష్మి (5 ఏళ్ల, 8 నెలల, 26 దినాల వయస్సు) 37 నిమిషాల పాటూ వివిధ సంప్రదాయ గీతాలపై నర్తించి కూచిపూడి నృత్య రికార్డును సాధించింది. డ్యాన్స్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఏవీ సత్యనారాయణ, పదన్యాస నృత్యాలయ వ్యవస్థాపకుడు గురు రమ్యకృష్ణ, న్యాయనిర్ణేత హరీష్ తదితరులు ఆద్యను ఘనంగా సత్కరించారు. చిన్నారి ప్రతిభను కొనియాడారు.

అనంత సాహిత్యం స్ఫూర్తిదాయకం

అనంతపురం కల్చరల్: అనంత సాహిత్యం స్ఫూర్తిదాయకం. సాహితీక్షేత్రంలో అక్షర సేద్యం చేస్తున్న ప్రతి కవి, రచయిత ఆదర్శప్రాయంగా నిలవడం జిల్లాకే గర్వకారణమని వక్తలు కొనియాడారు. అరసం (అభ్యుదయ రచయితల సంఘం) ఆధ్వర్యంలో తెలుగు యూనివర్సిటీ విశిష్ట ప్రతిభా పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ శాంతినారాయణ, డాక్టర్ రావూరి భరద్వాజ స్మారక పురస్కారం అందుకున్న బండి నారాయణస్వామి, మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ వారి సాహిత్య విమర్శ పురస్కార గ్రహీత రాజారామ్‌ను జిల్లా వ్యాప్తంగా తరలి వచ్చిన వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఆదివారం ఉపాధ్యాయ భవన్ వేదికగా ఈశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. సాహిత్యం, రచనల ద్వారా సమాజానికి చేస్తున్న సేవలను అరసం గుర్తిస్తూ ప్రపంచానికి చాటుతుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అరసం రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, జనప్రియ కవి ఏలూరు యంగన్న, ఉప్పరపాటి వెంకటేశులు, డాక్టర్ తన్నీరు నాగేంద్ర, శ్రీనివాస్, డాక్టర్ జూటూరు షరీఫ్, నానీల నాగేంద్ర, టీవీ రెడ్డి, రియాజుద్దీన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు చామలూరు రాజగోపాల్ పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న రచయితలు

ఆదిశేషయ్య సేవలు అమూల్యం

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్ఎల్‌టీఏ) జిల్లా అధ్యక్షుడిగా సుదీర్ఘ కాలం పని చేసి, ఇటీవల స్కూల్ అసిస్టెంట్ కేడర్ నుంచి ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందిన వై.ఆదిశేషయ్యను సన్మానించారు. ఎస్ఎల్‌టీఏ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక కృష్ణకళా మందిరంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. గౌరవాధ్యక్షుడు ఓంటేరు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు అంకాల కొండయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్లపర్తి శివానందరెడ్డి, ఏపీ జేఏసీ-అమరావతి జిల్లా అధ్యక్షులు దివాకర రావు మాట్లాడుతూ.. ఆదిశేషయ్య ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడిగా 13 సంవత్సరాలు భాషోపాధ్యాయులకు సేవలు అందించారన్నారు. 2019లో ఉన్నతీకరణ పదోన్నతుల కోసం అనేక ఉద్యమాలు చేసి భాషా పండితులకు అందని ద్రాక్షలా ఉన్న పదోన్నతుల ఫలాలు అందించడంలో తన వంతు పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కరణం హరికృష్ణ, విజయభాస్కర్, విజయలక్ష్మి, శోభామణి, ఎర్రిస్వామి, జయపాల్ నాయుడు, లక్ష్మీనారాయణ, అక్కులప్ప, శ్రీనివాసులు, ప్రభాకర్, నరసింహారెడ్డి, కేశవమూర్తి, డెగావత్ రవీంద్ర నాయక్, శివమూర్తి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆదిశేషయ్యను సన్మానిస్తున్న దృశ్యం

ముగిసిన మొహర్రం వేడుకలు



అనంతపురంలో బీబీ ఫాతిమా పీర్ల ఊరేగింపు



రాప్తాడులో పీర్లను దర్శించుకుంటున్న భక్తులు

రాప్తాడు: మత సమరస్యానికి ప్రతీక అయిన మొహర్రం వేడుకలు ఆదివారం నియోజకవర్గ కేంద్రం రాప్తాడులో ఘనంగా జరిగాయి. ఆదివారం జలధి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో రాప్తాడులో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. శనివారం రాత్రి 11 గంటలకు గ్రామస్తులు అగ్ని గుండానికి నిప్పటించారు. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు పీర్లను గ్రామంలో ఊరేగించారు. భక్తులు మొక్కుబడుల రూపంలో బెల్లపు ఉంటలను పీర్లపైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. పీర్ల వెంట యువకులు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు తారతమ్యం లేకుండా అలావ్ తొక్కారు. ఉదయం 8 గంటలకు పీర్ల దేవుళ్లతో అగ్ని గుండ ప్రవేశం చేయించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి గ్రామంలో పీర్లను ఊరేగించారు. సాయంత్రం ఆరు గంటలకు గుండాన్ని పూడ్చి పీర్లను జలధికి తరలించారు. మొహర్రం ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే హంపాపురం, గొల్లపల్లి, పాలచెర్ల గ్రామాల్లో మొహర్రం జలధి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రాప్తాడు సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

జలధికి తరలిన బీబీ ఫాతిమా పీర్లు

అనంతపురం కల్చరల్: నగరంలోని విన్సెంట్ ఫెర్రర్ నగర్‌లో చిన్నపీర్ల పండుగ ఆదివారం సందడిగా సాగింది. హసేన్, హుస్సేన్, ఇమామ్ ఖాసీం, అల్లావలి, వన్నూరు వలి పీర్ల స్వాములతో అగ్నిగుండ ప్రవేశం చేయించారు. అనంతరం పీర్లను ఊరేగించారు. కార్యక్రమంలో ప్రభాకర్, దాసరి సాయిరాం, రాముడు,బాషా, కాటమయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే బీబీ ఫాతిమా పీర్ల జాతర ఘనంగా ముగిసింది. నగరంలోని ఐదో రోడ్డులో మకానం పరిసరాలు అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడాయి. చివరి రోజు పీర్లను జలధికి పంపించారు. ఈనెల 22న అమ్మవారి చివరి దర్శనం ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు.



పాలచెర్లలో జలధికి వెళ్తున్న పీర్లు

మందుబాబుల వీరంగం

అనంతపురం సెంట్రల్: నగరంలో గుత్తి రోడ్డు కెనాల్ వద్ద ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మందుబాబులు వీరంగం సృష్టించారు. బహిరంగంగా మద్యం తాగడమే కాకుండా విధుల్లో ఉన్న కానిస్టేబుల్స్‌తో దురుసుగా వ్యవహరించారు. బ్లూకోల్ట్స్ ద్విచక్ర వాహనాన్ని అడ్డగించి తాళాలు లాగేసుకున్నారు. వైన్‌షాపు ఎదురుగా బహిరంగంగా మద్యం తాగుతున్న వారిని గమనించిన బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ గంగరాజు, హోంగార్డు రామాంజనేయులుతో బుక్కరాయసముద్రం మండలం ఎల్‌బీ నగర్‌కు చెందిన షేక్‌షఫీ, షేక్ టిప్పు సుల్తాన్‌లు దురుసుగా వ్యవహరించారు. ఈ ఘటనతో స్థానికులు పెద్ద ఎత్తున గుమిగూడారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు.

ఉద్యోగాలకు 180 మంది ఎంపిక

అనంతపురం సెంట్రల్: డీఆర్‌డీఏ-సీడాప్, మెగా ఇంజినీరింగ్ కంపెనీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. మొత్తం 640 మంది నిరుద్యోగ అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా.. 180 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జాబ్స్ డిస్ట్రిక్ మేనేజర్ సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, సీడాప్ సిబ్బంది నారాయణస్వామి, తులసిరామ్, జీవన్, వెంకటేష్, మెగా కంపెనీ ప్రతినిధి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

అనంతపురం సెంట్రల్: నగరంలో నాయక్‌నగర్ స్మాస్ అకాడమీలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిసాయి. గెలుపొందిన క్రీడాకారులకు స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిని అభినందించారు. చదువులతో పాటు క్రీడలకు విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా బుగ్గయ్య చౌదరి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పీరుకు వెండిగొడుగు వితరణ



అలగ్గారస్వామికి వెండిగొడుగు అందజేస్తున్న జెడ్పీటీసీ చంద్రకుమార్ దంపతులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లిలో అలగ్గారస్వామి పీరుకు జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్ కేజీ వెండిగొడుగు విరాళంగా అందజేశారు. మొక్కుబడిలో భాగంగా ఆదివారం జరిగిన ఊరిగేంపులో జూటూరు చంద్రకుమార్, జూటూరు ప్రశాంతి దంపతులు గొడుగును స్వామికి అందజేశారు. పీర్లను అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం జలధికి వెళ్లాయి. కార్యక్రమంలో గ్రామస్తులు అఖిల్, సాయి, పురుషోత్తం, తిరుమలయ్య, ఓబులేసు, పునీత్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



రామగిరి: అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు



ఆత్మకూరు: పాఠశాలలో సమావేశమైన విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

రామగిరి: మండలంలోని పోలేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 23 ఏళ్ల అనంతరం విద్యార్థులంతా పాఠశాలలో కలవడంతో సందడి వాతావరణం నెలకొంది. ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. చదువుకునే రోజుల్లో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

అపూర్వ కలయిక.. ఆనందాల వేడుక

ఆత్మకూరు: మండలంలోని పి.యాలేరులోని లిటిల్ ఫ్లవర్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1988-1995 సంవత్సరాల్లో 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు తరలివచ్చారు. విద్యను బోధించిన ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి, శాలువాలతో సన్మానించారు. 90 సంవత్సరాల చరిత్ర కలిగిన పాఠశాలలో ఇలా అన్ని తరగతుల విద్యార్థులు ఒకచోట కలవడం సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.